




"క్రమలా! రేపు నీ పుట్టినరోజు కదా? చెప్పమ్మా - ఏం కావాలో?" ఆప్యాయంగా అడిగాడు రంగరాజుగారు.

కమల వెంటనే మాట్లాడలేదు. ఆమె మనసులో ఎన్నో ఆలోచనలు. ఏం అడగాలి? ఎన్నని అడగాలి?



తండ్రి స్థోమత తనకు తెలీంది కాదు- కాలెండర్ మారేసరికల్లా ఇంట్లో వస్తున్న మార్పుల్ని, చేష్టల్ని క్షుణ్ణంగా అర్థం చేసికో గలిగే వయసు తనకు రావటమే కాదు- ఆ మార్పుల వల్ల జీవితాలు తీసుకొంటున్న మలుపుల్ని, ఆ మలుపుల గమ్యాల్ని గమనించ గలిగే స్థోమతా వస్తోంది. ఆరేడేళ్ళ క్రితం క్రొత్తగా చిమ్మిలి తిన్న

రోజుల్లో తన కోరిక - ఓ వోణీ కొనుక్కోవాలని! పట్టు వోణీ- ఆకాశం రంగు పట్టు వోణీ-బార్డర్ ఉంటే మంచిదే! అమ్మ నవ్వుతూ అంది- "పట్టుచీరె కట్టు కోవాలి కాని వోణీ కాదే!" పట్టు చీరె కట్టుకొన్నప్పుడల్లా పైట కొంగు కూడా పట్టుదే అవుతుంది కదా, మరి వోణీ అమ్మ వద్దంటుందేం? ప్రశ్నే! అయినా అమ్మను అడ గనూ లేదు, నాన్న పట్టువోణీ కొననూలేదు. ఆకాశం రంగు పట్టువోణీ ఆకాశపు టంచుల్లోనే ఉండిపోయింది. తనను చేరుకోవ టానికి అది దిగిరాలేదు. దాన్ని అందుకోవటానికి తను ఆ ఎత్తుకు ఎగరలేకపోయింది.

మూడేళ్ళ క్రితం-తన కోరిక వోణీల్లోంచి చీరలోకి వచ్చింది. అమ్మ అప్పుడూ పడనివ్వలేదు- "ఇప్పటి నుంచీ ఎందుకే నీకు చీరలూ, సారెలూనూ? జీవిత మంతా చీరలతోనే గడవాలి. ఇప్పుడు ఇలా ఉండు-చాలు!" అంది. అనటంతోనే తన కోరికకు సమాధి అయిపోయింది ఆ మాట. తనకప్పుడు చీరె రాలేదు. పక్కింటి కోదండంగారమ్మాయి కొను క్కొన్న కనకాంబరం రంగుచీరె, క్రింద నెమళ్ళ డిజైన్ బార్డర్.... ఆ చీరలాటిది తను కొనుక్కోలేక పోయింది.

మళ్ళీ ఇన్నాళ్ళకు-తనకు ఈ సారి ఇంకో కోరిక ఉంది.

కోరితే... ?

వద్దంటారేమో!

అసలు ఏమీ అడగకపోయినా, ఏదో ఒకటి కొనిస్తారు. కాని, తను అడిగితే వద్దంటే....?

కమల ఏమీ అనకపోవటంతో రంగరాజు మళ్ళీ అడిగారు - "చెప్పమ్మా-ఏం కావాలంటే అది కొనిస్తాను."

కమల నవ్వింది - "అమ్మ వద్దంటే మానేస్తారు గదూ?"

రంగరాజుగారికీ నవ్వొచ్చింది- పిల్లల దృష్టిలో తనెంత భార్యా విధేయుడు!__"ఈ సారి అమ్మ వద్దన్నా కానీ కొనిస్తానమ్మా!"

"ఏదైనా?"

"ఊ(-ఏదైనా అంటే అన్నీ ఎలాగూ కొనివ్వలేను. నీకు ఈ సారి ఏమైనా కొనివ్వాలని నేను ఫెస్టివల్ అడ్వాన్స్‌కు అప్లయి చేసి తీసుకొన్నానమ్మా!"

"అంటే నూటాయాభై రూపా యలా?"

"వంద వరకూ నీవేననుకో- మిగతా యాభై ఇప్పటికే ఫలు సులో పడ్డాయి."

క్షణం ఆగి అంది కమల- "అయితే నాకో సూట్ కేస్ కొనివ్వండి నాన్నా!"

రంగరాజుకు ఆశ్చర్యం వేసినా ఊరుకొన్నారు. అమ్మాయి సూట్ కేస్ కావాలని అడగటం ఆశ్చర్యం కలిగించింది. అయినాఆలోచిస్తేంటే అర్థం అయింది- కమల కోరటంలో ఉన్న సబబు ఏమిటో!

రేపో మాపో మరో ఇంటిని వెతుక్కోవలసిన పిల్ల. ఈరోజు నుంచీ వేరుపడుతానంటోంది. తన జీవితం సర్దుకోవటానికి కొత్త సూట్ కేస్ కావాలంటోంది.

"సాయంత్రం వెళ్ళి కొనుక్కొచ్చుకొందాంలేమ్మా! నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి నువ్వు సిద్ధంగా ఉండు" అన్నారు రంగరాజుగారు.

మధ్యాహ్నం భోజనం వడ్డిస్తూ అడిగింది కమల తల్లి రుక్మిణి, కూతుర్ని - "ఏమిటే, సూట్ కేస్ కావాలన్నావుట?"

"నువ్వు వద్దన్నావా?" చివాలున అడిగింది కమల.

"ఇప్పటి నుంచీ ఎందుకు? పెళ్ళయ్యాక అత్తారింటికి వెళ్ళేటప్పుడు ఎలాగూ కొత్తది కొనివ్వాలి కదా! ఇప్పుడే కొంటే...?"

"అప్పటికి పాడవుతుంది. అవునా?" రుక్మిణి అంటున్న మాటలను కట్ చేస్తూ, అంది కమల- "ఏం పాడు చేసుకోను! అయినా నా పెళ్ళి ఈవేళో రేపో చేస్తున్నట్లు మాట్లాడతావేం? అది ఇప్పుడప్పుడే జరిగే పని కాదని నాకూ తెలుసు!"

కమల విసురుగా అనటం రుక్మిణికి గాయం చేసినట్లయింది. అయినా తమాయించుకొని అంది, విషయాన్ని తేలిక చేస్తూ-"ఇంతకీ పెళ్ళి కోసం తొందరన్నమాట!"

"అవును, పెళ్ళి కోసం కాదు, మొగుడి కోసం! చాలా?" అంటూ- "నాకింత మజ్జిగ పోస్తే చాలు- పెట్టె కొనద్దని నాన్నగారితో చెప్తాలే" అంది కమల.

రుక్మిణి ముఖం చిన్నబుచ్చుకొంటూ అంది-"అదేమిటే? కన్నతల్లినని అయినా ఆలోచించక అంత మాటలనేస్తావ్? నీ ఇష్టం వచ్చినట్లే కొనుక్కో."

సాయంత్రం రంగరాజుగారితో బజారుకు వెళ్ళిన కమల, తనకు నచ్చిన నల్లరంగు సూట్ కేస్తో ఇంటికి చేరేసరికి చీకట్లు ముసురుకుంటున్నాయి.

ఆ తల్లి మనసులో కొండంత గుబులు.

ఆ తండ్రి మనసులో కొండంత

సంబరం.

ఆ పిల్ల గుండెల్లో కొండంత ఆశలు!

* * *

మళ్ళీ పుట్టినరోజు ఇంకా రానే లేదు.

ఓ రోజు - ఇంకా రోజుగా రూపం దిద్దుకోక మునుపు, చీకట్లు తెల్లని రంగు దిద్దుకొనే ప్రయత్నంలో ఉన్నప్పుడు ఏదో అలికిడి అయినట్లయి నిద్రలోంచి ఉలికిపడి లేచారు రంగరాజుగారు.

కలత నిద్ర-ఎందుకు మెలుకువ వచ్చినట్లు?

బెడ్ లైట్ వెలుగులో గదంతా మసకగా కనిపిస్తోంది. తలుపు తీసుకొని బయటకొచ్చారు రంగరాజుగారు.

ఆ గదిలోంచి బయటకు వచ్చిన రంగరాజుగారికి వెనుకవైపు తలుపు తీసినట్లే కనపడింది. రంగరాజు గారి గుండెలన్నీ ఒక్కసారి అవిసిపోయాయి. దొంగతనమా? తన బ్రతుకులో ఏముందని? ఏం దోచుకోవాలని ఈ ప్రయత్నం జరిగి ఉంటుంది?

తన జీవితం ఏ రంగుతో వెలిగిపోతోందని - ఆ రంగు దోచుకొనే ప్రయత్నం ఇది??

రంగరాజుగారు భయంతో, ఆత్రుతతో తన గదిలోకి వెళ్ళి, భార్యతో చెప్పి బాధను పంచుకోవాలని-ఆగిపోయారుఏదోగుర్తుకు రాగా.

అన్నట్లు కమల ఏదీ?

ప్రక్క మీద దుప్పటి తప్ప... కన్నకూతురు ఏమయిపోయింది? ఏ బాత్ రూంలోకో వెళ్ళిందనుకొనే వీలులేకుండా ఇంట్లోనే బాత్ రూమ్ కదా?

రంగరాజుగారికి మనసులో ఆలోచనల చీకట్లు విడాయి-వయసు పోరుతోంటే, కమల పక్కమీంచి లేచిందన్నమాట! లేచి....ఎంతపని చేసిందో....?

రంగరాజుగారు ఇంట్లోచూస్తే-సూట్ కేస్ లేదు. అంటే.... ఏముందీ-సూట్ కేసూ లేచి....

రంగరాజుకు మనసంతా పుట్టెడు దుఃఖం. అయినా ఎక్కడినుంచో తెలీని ఆశ. అందుకే బాధను పంచుకోవటం ఎందుకని ఆలోచిస్తూ, కూతురు నిజంగా ఇంకా ఏమీ తప్పు చేయకుండా ఉంటే తెచ్చి కనుపాపలాగా చూసుకోవాలనుకొంటూ ఆశల వత్తులతో ఆ చీకటి ముసురుల్లో-లేని కూతురు కోసం తెగ వెతికాడు.

ఇంటి కొచ్చేసరికి.... భార్య రుక్మిణి ఇంకా నిద్రపోతూనే

ఉంది.

దుఃఖం ఆపుకోలేక, బాధ భరించలేక, బాధ్యతగా భార్యను నిద్ర లేపాడు. కంగారుగా ఉలికి పడి నిద్ర లేస్తూ అంది రుక్మిణి- "అయ్యయ్యో! ఎంత వెలుగొచ్చేసిందండీ? ఇంతసేపూ లేచానే కాను?"

ఆ మాటల్లో ఉన్న నిజం క్షణం రంగరాజుగారిని మరింత క్రుంగదీసింది. కంట్లో నీళ్ళు నిండుకొంటోంటే అన్నారు-"వెలుగు కాదే, చీకటి వచ్చేసింది! మనం లేవక మునుపే కమల లేచిపోయింది!"

రుక్మిణి క్షణంలో నివ్వెరపోయింది.

పైకి ఏడ్చే హక్కు లేక, అంత ధైర్యం లేక, గుండెల్లోనే బాధను గుట్టుగా ఉంచుకోలేక రుక్మిణి నరకాన్ని ఆ క్షణంలో చవిచూసింది.

ఎంత పట్నమైనా-రేపు 'ఏదీ మీ అమ్మాయి?' అని అడిగితే...?

రుక్మిణి మనసులో కొండంత బాధ!

రంగరాజుగారి మనసులో కోటి భయాలు!

అమ్మాయి ఏమయిపోయిందో నన్న భయం - ఏమయిపోతోందో నన్న ఆత్రుత - వాళ్ళ జీవితంలో కనుపించని చీకట్లు కమ్మాయి.

బ్రతికి ఉన్న శవాలు రెండు-ఆ ఇంట్లో - ఆ రోజు నుంచి జీవించటం ఆరంభించాయి.

మూడు రోజుల తర్వాత స్థానిక పత్రికల్లో ఓ ప్రకటన- "నువ్వు అన్నీ తీసుకెళ్ళినట్లే అనుకుంటున్నావు కానీ, సూట్‌కేస్‌లో సామాన్లు నిజానికి మాతోనే ఉన్నాయి. తిరిగి వస్తే, భద్రంగా అన్నీ ఇస్తాం. వచ్చి, అన్నీ తీసుకొనే వెళ్ళు!"

ఆ వార్తా పత్రికల్లో ప్రకటన ఎంత దూరం వెడుతుందో, ఆ ప్రకటన అర్థం ఎందరికి తెలుస్తుందోనని ఆలోచించిని వాళ్ళకు-కోటి ఆశలు కళ్ళల్లో కదలాడాయి.

అంతకన్నా ఎక్కువ చెబితే- అందరికీ తెలిస్తే.... అవమానం తప్ప ఏం మిగులుతుంది? తనకేమీ అందజేయని మనుషులు అవమానం మాత్రం ఎందుకు అందివ్వాలి?

ఆ కారణంతోనే రంగరాజుగారు-ఆలోచనల్లో కూతుర్ని తన తమ్ముడి ఇంటికి పంపారు!

* * *

కమల ఇంట్లో ఉండి ఉంటే, ఎల్లుండి ఇరవయ్యవ పుట్టినరోజు జరుపుకొని ఉండేది.

సూట్‌కేస్ కొనుక్కొన్నది

క్రిందటి పుట్టినరోజుకే! ఈసారి ఏం కొనివ్వాలి? ఎవరికి??....

రంగరాజుగారు ఆలోచనలతో సమాధి కట్టుకొంటూంటే, రుక్మిణి ఏ ఆలోచనలూ లేకనే సమాధి లోకి వెళ్ళిపోతోంది.

విధి దూసిన కత్తులతో, కాలం చేసిన గాయం ఆ ఇద్దరినీ సజీవంగా పొట్టన పెట్టుకొంటోంది.

అప్పుడు—

సాయంసంధ్య చీకటి చీర కట్టుకొన్నప్పుడు—

చుక్కా కన్నెలు తళుకు బెళుకులు దిద్దుకొంటున్నప్పుడు—

ఊరంతా ఇంకా పూర్తిగా మత్తు నిద్రలోకి జారుకోకమునుపు తలుపు చప్పుడయింది.

రంగరాజుగారు, భార్య కేసి అన్నారు- "చూడవే, ఎవరో వచ్చారు!"

"మనింటికి ఎవరొస్తారండీ ఇప్పుడు?" అంటూ విసుక్కొంటూనే తలుపు తీసిన రుక్మిణికి ఎదురుగా-కొండంత కూతురు!!

అయితే కొండంతా పూర్తిగా మోడయినట్లుంది!

చూసింది నిజమో, కలో అర్థం కాని స్థితిలో, గతం కంట్లోకి ధారగా ప్రవాహం కడుతున్నప్పుడు, ఆప్యాయత మాటలకు ఆనకట్ట వేస్తున్నప్పుడు, పద్ద బాధలు కోపంగా రూపం దిద్దుకొంటున్నప్పుడు.... రుక్మిణి మాటలు పేర్చుకొంటూ అంది-"రా!"

"ఎవర్ని రమ్మంటున్నావ్?" అంటూ లేచి వచ్చిన రంగరాజుకు కంటినిండుగా ఆశ్చర్యం-ఆశ్చర్యం స్థానే సంతోషం!

సంతోషం నెమ్మదిగా దుఃఖంగా రంగు మార్చుకొంది.

తల్లీ దండ్రీ - ఇద్దరూ చెరో పక్కనా నిలబడి, కన్నీటికి దోపిళ్ళు పడుతోంటే.... కమల లోపలికి నడిచింది-సూట్ కేస్ చేతిలో ఉంచుకోనే!!

కమల లోపలికి నడిచి.... సూట్ కేసు ఒక మూలన ఉంచి, ఆ పక్కనే శరీరంలో అన్ని అంగాలు ఒక్కసారి క్రుంగిపోయినట్లు - ముద్దలా కూలబడి.... చిన్నగా కన్నీటి వరదకు వెక్కిళ్ళ ఉప్పెన జతచేసింది.

రంగరాజుగారు ముందుగా కోలుకొన్నారు. ఉన్నట్లుండి లేచి, వెంటనే తలుపు వేసి, కమల ఉన్న గదిలోకి వస్తూ అన్నారు-"కమలా! నువ్వు వస్తోన్నది ఎవరూ చూడ లేదు గదా?"

కమల ఉలికిపడి తలెత్తింది- 'అంటేఎందుకొచ్చావనాఈప్రశ్న?'

"నువ్వు బాబయ్య ఇంటికి వెళ్ళావని అందరితో చెప్పాం- నువ్వూ అదే చెపుదువుగాన్లే...."

తను చెప్పాల్సిన మాటలన్నీ అయి పోయినట్లుగా బయటకు నడుద్దా మనుకొంటూంటే ఆయన కళ్ళల్లో సూట్ కేస్ పడింది.

ఆసూట్ కేస్-తను కొన్నప్పుడు కొత్తది-అందంగా వుండేది- ఆకర్ష ణీయంగా ఉండేది....

ఇప్పుడు-ఆ సూట్ కేస్ లోంచి బట్టలు కొన్ని బయటకుతొంగిచూస్తు న్నాయి. తాళాలు రెండు ఉన్నా, పటు త్వం లేక పోయినట్లు తాడుతో బిగింపబడి ఉంది. పాతదై, రంగు పోయి, వెలిసి పోయినట్లయి...అస హ్యంగా..

క్షణం ఆగి అన్నారు రంగరాజు గారు-"పోన్లే అమ్మా! పెద్దగా బాధ పడకు. కొత్త సూట్ కేస్ కొనిస్తా- ఎల్లుండి కదా నీ పుట్టిన రోజు!"

కమలకు అంత దుఃఖం లోనూ నవ్వొచ్చింది-తండ్రి అమాయకత్వా నికి ఆశ్చర్యం వేసింది. ఆ అప్యా యతకు ఏడుపొచ్చింది.

ఆ రాత్రి ఇంట్లో కంచాలు లేవ లేదు. చుట్టూ చీకటి బాగాముసురు కొన్నప్పుడు, ఊరంతా అలికిడి లేకుండా నిద్రలోకి జారు కొన్న ప్పుడు - తండ్రితో, పక్కగదిలో తల్లి అంటున్న మాటలు కమలకు వినపడ్డాయి.

"సూట్ కేస్ బొత్తిగా పాడై పోయిందండీ! దాన్ని బాగు చేయిం చడం ఇంక కుదరదేమో?"

ఆ మాటలు విన్న కమలకు బ్రతికి ఉండగానే తన్నెవరో చితి మీదకు చేర్చినట్లుగా అనిపించింది. ఆ దృశ్యం తాను చూడలే నన్నట్లుగా ఆమె తన ముఖాన్ని దోసిట్లో దాచుకొంది.

ఆ గది నిండా, ఆమె జీవితం లాగానే-

చీకటి- చిక్కని కాటుక లాటి చీకటి-కమల గతం లాటి చీకటి- కమల భవిష్యత్తు లాటి చీకటి! *